ఆ సూఫీ మహాత్ముడు సరేనన్నట్లుగా తల ఊపాడు. ఆమె తన బిడ్డతో వెళ్ళిపోయింది. ఆమెని ఆయన ఒక్క ప్రశ్న వేయలేదు, ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం ఆమె నించి కృతజ్ఞతని కూడా ఆయన ఎదురు చూడలేదు. ఆ బిడ్డ తన దగ్గరకి రాక మునుపు ఆయన మనఃస్థితి ఎలా వుందో ఇప్పుడూ అలానే వుంది. ఇంతకాలం ఆ పాప సాన్నిహిత్యం ఆయన్ని ఏం మార్చలేదు. ఎందుకంటే వచ్చినది ఏదైనా సరే పోతుందన్న సత్యం ఆయనకి తెలుసు.

## 89. ఆ ముగ్గురూ

తన రాజ్యంలోని ప్రజలు ఎలాంటివారో స్వయంగా తెలుసుకోడానికి ఓ రాజు తన మంత్రితో ఓ రాత్రి మారువేషంలో వెళ్ళాడు. ఓ ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటతను తలుపుతీయకుండానే 'ఎవరు?' అని ప్రశ్నించగానే చెప్పాడు.

"మేం ప్రయాణీకులం. ఈ రాత్రి మీ అతిథులుగా మీ ఇంట్లో వుండ నిస్తారా?"

"మీరు దొంగలో, ఎలాంటివారో నాకేం తెలుసు? కుదరదు." తలుపు తీయకుండానే లోపలనించి జవాబు చెప్పాడు ఆ ఇంటి యజమాని.

రాజు, మంత్రి వెళ్ళి ఇంకో ఇంటి తలుపు తట్టారు. ఆ ఇంటి యజమాని తలుపు తీసి అడిగాడు.

"ఎవరు మీరు? ఎందుకు తలుపు తట్టారు?"

"పొరుగూరు నించి వచ్చాం. ఈ రాత్రికి మీ ఇంట్లో ఆతిథ్యం, ఆశ్రయం కోరుతున్నాం."

"మీరు ఎంతమందో చెప్పండి. అప్పుడు ఆలోచించి చెప్తాను." బదులు చెప్పాడతను.

"మేం ఇద్దరం."

"ఐతే తలో రెండు మొహర్లు చెల్లించి లోపలకి రండి." ఆహ్వానించాడు అతను.

"మా దగ్గర డబ్బు లేదు."

"ఇదేం ధర్మ సత్రం అనుకున్నారా? కుదరదు." చెప్పి తలుపు మూసేసాడు ఆ ఇంటి యజమాని.

రాజు మూడో ఇంటి తలుపు తట్టాడు. చేతిలో లాంతరుతో తలుపు తెరచిన ఆ ఇంటి యజమాని వాళ్ళ గురించి తెలుసుకోగానే ఆహ్వానిస్తూ చెప్పాడు.

"భోజనం అరగంటలో సిద్ధం అవుతుంది. ఈలోగా ఈ లాంతరు తీసుకెళ్ళి బావి దగ్గర స్నానం చేసిరండి. పడుకుని రేపు వెళ్ళండి."

మర్నాడు రాజు ఆ ముగ్గురిని పిలిపించి మొదటివాడితో చెప్పాడు.

"అతిథులెవరో, దొంగలెవరో తలుపు తీసి చూడకుండానే నిర్ణయించి, అందర్నీ అనుమానించే నువ్వు నా దేశంలో వుండటానికి అర్హుడివి కావు. వెంటనే నా దేశాన్ని విడిచి వెళ్ళిపో. లేదా మరణ శిక్ష తప్పదు."

రెండో వాడికి డబ్బిచ్చి చెప్పాడు.

"ఇంకెన్నడూ అతిథులతో వ్యాపారం చేయక. వాళ్ళని ఆదుకో."

తనకి ఆశ్రయం ఇచ్చిన మూడో వ్యక్తితో చెప్పాడు రాజు.

"నీలాంటి వారి వల్లే దేశాభివృద్ధి జరిగేది. ఇకనించి నువ్వు ప్రభుత్వానికి ఎలాంటి పన్నులూ కట్టనవసరం లేదు."

'మన దగ్గరే వుంచుకుంది మనది కాదు, ఇతరులకి ఇచ్చింది మనది' అన్న ఆధ్యాత్మిక సూత్రానికి ఈ కథ మంచి ఉదాహరణ.

## 90. దేవుడి దయ విలువ

ఒకతను మరణించాక యమధర్మరాజు దగ్గరకి వెళ్ళాడు. తను చాలా పుణ్య కార్యాలు చేసానని, తనని స్వర్గానికి పంపమని కోరాడు.

"నువ్వు చేసిన మంచి పనులు చెప్పు. నీకు వంద పాయింట్లు వస్తే నిన్ను స్వర్గానికి పంపుతాం." చెప్పాడు యముడు.

"సరే. నేను ఏభై ఏళ్ళ క్రితం వివాహం చేసుకున్నాను. ఆ తర్వాత ఎన్ని మంచి అవకాశాలు వచ్చినా నిజాయితీగా జీవించాను తప్ప ఆఖరికి నా మనసు ద్వారా కూడా ఎలాంటి తప్పూ చేయలేదు." చెప్పాడు అతను.